సాక్షి
అనకాపల్లి
శుక్రవారం । 19 । మే । 2023



ఆధ్యాత్మిక నెలవు 8లో
చోడవరం శ్రీస్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయంలో రూ.3 కోట్లతో మూడు రాజ గోపురాలు నిర్మించారు.



'మత్తు' ముఠా.. ఆటకట్టు 8లో
మత్తు పదార్థాలు విక్రయిస్తున్న ఐదుగురిని విశాఖ పోలీసులు అరెస్ట్ చేశారు. భారీ సంఖ్యలో ఇంజిక్షన్లు స్వాధీనం చేసుకున్నారు.



మేకపాటి ఏయూ సందర్శన
విశాఖ: మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి గురువారం ఏయూను సందర్శించారు. వీసీ ప్రసాద్‌రెడ్డిని అభినందించారు.

పాడి దిగుబడిపై వడదెబ్బ!

యలమంచిలి మండలం సోమలింగపాలెం గ్రామానికి చెందిన యండమూరి సత్యనారాయణ 20 రోజుల క్రితం రూ. లక్షా 30 వేల విలువైన క్రాస్‌బ్రీడ్ హెచ్‌ఎఫ్ ఆవును కొన్నాడు. పది రోజుల క్రితమే ఈనింది. రోజుకు 30 లీటర్ల వరకు పాలు ఇచ్చేది. ఎండ తీవ్రత కారణంగా సోమవారం(15న) అస్వస్థతకు గురైంది. సమీప డెయిరీ డాక్టర్ వచ్చి పరీక్షించగా 109 జ్వరంతో బాధపడుతున్నట్లు తేలింది. వైద్యం అందించినప్పటికీ పూర్తిగా కోలుకోలేదు. దీంతో సదరు రైతు 1962కు కాల్ చేశాడు. వెంటనే సమీప సోమలింగపాలెం పశువైద్య సిబ్బంది డాక్టర్ జె.పద్మజ హుటాహుటిన అక్కడకు వెళ్లి అత్యవసర చికిత్సను అందించారు. దీంతో సాయంత్రానికి లేచి గడ్డి తినడం మొదలెట్టింది. ప్రాణాపాయ స్థితికి చేరుకున్న ఆవు కోలుకోవడంతో ఆయన ఆనందం వర్ణనాతీతం. దానికి కారణమైన పశువైద్య సిబ్బందికి, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

- హైబ్రిడ్ జాతి హెచ్‌ఎఫ్, ముర్రా, జెర్సీ ఆవులపై ఎక్కువ ప్రభావం
- జిల్లాలో ఇప్పటికే 7 పశువ్యాధి నిర్ధారణ కేంద్రాల ఏర్పాటు
- 13 సంచార అంబులెన్స్‌ల ద్వారా వైద్యసేవలు



ఎండ వేడికి సొమ్మసిల్లిన హెచ్‌ఎఫ్ ఆవు



వైద్య సేవల అనంతరం తేరుకోవడంతో గడ్డి తినిపిస్తున్న పాడిరైతు సత్యనారాయణ

సాక్షి, అనకాపల్లి : గత రెండు వారాలుగా జిల్లాలో ఎండ తీవ్రత పెరిగింది. గతేడాది కన్నా ఈసారి అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ ఉష్ణోగ్రతలు పాల దిగుబడిపై కూడా ప్రభావం చూపుతున్నాయి. పాడి పశువుల్లో గేదెల కన్నా ఆవుల్లోనే వడదెబ్బ ప్రభావం ఎక్కువగా ఉంటోంది. ప్రధానంగా హైబ్రిడ్ జాతి హెచ్‌ఎఫ్, ముర్రా, జెర్సీలాంటి ఎక్కువ పాల దిగుబడినిచ్చే ఆవులకు ఈ ఎండలు శరాఘాతంగా మారుతున్నాయి. ఆవులు వడదెబ్బకు గురికాకుండా పశుసంవర్ధక శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది.

అవగాహనతో అప్రమత్తం

జిల్లాలో 60–70 శాతం రైతులు వ్యవసాయంతో పాటు, పాడి పరిశ్రమపై దృష్టి సారిస్తున్నారు. దీంతో వడదెబ్బ నుంచి పాడి పశువులను కాపాడుకునేలా పశుసంవర్ధక శాఖ అధికారులు పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. వేసవిలో పాడి పశువులకు వడదెబ్బ తగిలితే పాల దిగుబడి తగ్గడంతోపాటు, శాశ్వతంగా చూడి అవకాశాలు కోల్పోవచ్చు. ఒక్కోసారి వాటి ప్రాణాలకు కూడా ముప్పురావొచ్చు. వడదెబ్బ ప్రభావంతో అస్వస్థతకు గురైతే తక్షణమే పశు సంచార అంబులెన్స్ నెంబర్‌కు గానీ, సమీప ప్రభుత్వ పశువైద్యశాలల్లో గానీ సంప్రదించాలని విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే 7 పశువ్యాధి నిర్ధారణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ వెటర్నరీ ఆస్పత్రుల్లో వైద్యులు, ఆర్‌బీకేల పరిధిలో వెటర్నరీ అసిస్టెంట్లు, 13 సంచార అంబులెన్స్‌ల ద్వారా వైద్యసేవలు అందిస్తున్నారు.

వడదెబ్బ లక్షణాలు

వడదెబ్బకు గురైన పశువుల శరీర ఉష్ణోగ్రత 101 డిగ్రీల నుంచి 108 డిగ్రీల వరకు పెరుగుతుంది. నడిచేటపుడు తూలుతాయి. శ్వాస రేటు పెరుగుతుంది. పశువు చాలా నీరసంగా కనపడుతుంది. ఒక్కోసారి కిందపడి కొట్టుకుని స్పృహ కోల్పోతాయి. నీటి కోసం ఆత్రంగా చూస్తుంటుంది. చర్మం పొడిబారుతుంది. పాడి పశువు అయితే పాల ఉత్పత్తి పడిపోతుంది. ఈ లక్షణాలుంటే వడదెబ్బ తగిలిందని రైతు గ్రహించాలి.

ముందు జాగ్రత్తలు

పశువులకు వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పశువుల పాక చుట్టూ పాత గోనెలు కట్టి వాటిని తడుపుతూ ఉండాలి. పైకప్పును కొబ్బరి కమ్మలతో గానీ, ఎండు గడ్డితో గానీ కప్పాలి. మంచి నీరు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలి. కలుషిత నీరు తాగితే పారుడు వ్యాధుల బారిన పడే ప్రమాదముంది. రోజులో కనీసం మూడు సార్లు పరిశుభ్రమైన నీటిని అందించాలి. పశువులను ఉదయం, సాయంత్రం చల్లని వాతావరణంలో మాత్రమే మేత కోసం విప్పాలి. పశువులు ఎక్కువగా ఎండలో తిరగకుండా చూడాలి. వీలైనంత పచ్చని మేతను ఇవ్వాలి. సంకరజాతి ఆవులైతే పంకాలు ఏర్పాటు చేయాలి.

జిల్లాలో పశు వైద్య సేవలు

- 2022-23లో 5,333 అత్యవసర వైద్య సేవలు. వీటిలో పశు సంచార అంబులెన్స్‌లు ద్వారా అందించినవే 453.
- 7 పశువ్యాధి నిర్ధారణ కేంద్రాల ద్వారా 17,484 నమూనాలను పరీక్షించారు.
- 2022-23కు గాను.. 8,15,982 పశువులకు ప్రాథమిక చికిత్స అందించారు.
- 14,13,012 పశువులకు టీకాలు వేశారు.



ఆవుకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

పశువుల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ



వేసవిలో పాడి పశువుల సంరక్షణపై రైతులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. వడదెబ్బ తగిలిన పశువును చల్లని నీటితో కడగాలి. ఐసును గుడ్డతో చుట్టి పశువు నుదుటిపై ఒత్తాలి. దగ్గరలో ఉన్న పశువైద్యుడిని సంప్రదించి సెలైన్లు పెట్టాలి. ఒక్కోసారి వడదెబ్బ తగిలిన పశువుకు బతికినంతకాలం పాల దిగుబడి గతంలో మాదిరిగా ఉండదు. ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే మంచిది.

–ప్రసాదరావు, పశు సంవర్ధక శాఖ జేడీ, అనకాపల్లి

7,969 మంది వలంటీర్లకు సేవా పురస్కారాలు

తుమ్మపాల : రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు క్షేత్రస్థాయిలో విశేష సేవలందిస్తున్న గ్రామ, వార్డు వలంటీర్లకు రాష్ట్ర ప్రభుత్వం సేవా పురస్కారాలతో సత్కరించనుంది. ఈ మేరకు జిల్లాలో 522 సచివాలయాల్లో సేవలందిస్తున్న 9,209 మంది వలంటీర్లకు గాను 7,969 మందిని ఎంపిక చేసినట్టు డీఎల్‌డీవో మంజులావాణి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 34 మందికి సేవా వజ్ర, 135 మందికి సేవా రత్న పురస్కారాలను జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి చేతుల మీదుగా శుక్రవారం అందించనున్నట్లు వెల్లడించారు. 7800 మందికి సేవా మిత్ర పురస్కారాలను సచివాలయ పరిధిలో అందించనున్నట్టు తెలిపారు. జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో పాటు సేవా వజ్రకు రూ.30 వేలు, సేవా రత్నకు రూ.20 వేలు, సేవా మిత్రకు రూ.10 వేలు చొప్పున, వారి బ్యాంకు ఖాతాలో నగదు జమచేయనున్నట్టు పేర్కొన్నారు.

రేపు ఏయూ-ఐఓసీఎల్ స్టార్టప్ ఫండ్ పిచింగ్ ప్రోగ్రాం

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సంయుక్తంగా ఈ నెల 20న ఐఓసీఎల్ స్టార్టప్ ఫండ్ పిచింగ్ ప్రోగ్రాంను నిర్వహిస్తున్నారు. శనివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఏయూ సెనేట్ మందిరంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. కార్యక్రమంలో ఐఓసీఎల్ రీసెర్చ్–డెవలప్‌మెంట్ విభాగం డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఎస్.వి రామ్ కుమార్ పాల్గొంటారు. ఈ సందర్భంగా ఐఓసీఎల్ అందించే స్టార్టప్ పథకాలు, ఆర్థిక ప్రయోజనాలు వివరిస్తారు. విద్యార్థులకు, పరిశోధకులకు, ఆచార్యులకు పరిశోధన ప్రాజెక్టులు అందించే అంశాలపై చర్చిస్తారు. హైడ్రో కార్బన్ రంగంలో నూతన స్టార్టప్‌లను సాధించే దిశగా అవకాశాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి పాల్గొంటారు. పూర్తి వివరాలకోసం ఐపీఆర్ చెయిర్ ప్రొఫెసర్ డాక్టర్ హెచ్.పురుషోత్తంను 9599229217 నంబరులో సంప్రదించాలి.

న్యూస్‌రీల్

ఎస్పీ కార్యాలయానికి కంప్యూటర్లు అందించిన హెటిరో



కంప్యూటర్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ, చిత్రంలో హెటిరో చైర్మన్ పార్థసారథి

అనకాపల్లిటౌన్ : నక్కపల్లి హెటిరో సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్‌ఆర్)లో భాగంగా జిల్లా ఎస్పీ కార్యాలయానికి 10 డెస్క్‌టాప్ కంప్యూటర్లను అందించింది. వీటిని ఎస్పీ కె.వి.మురళీకృష్ణకు సంస్థ చైర్మన్ బండి పార్థసారథి వీటిని అందించారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ జిల్లా పోలీసులకు పాలనాపరమైన అవసరాలకు ఉపయోగపడేలా ఈ కంప్యూటర్లను ఇచ్చినట్టు పేర్కొన్నారు. వీటి కోసం సీఎస్సార్ నిధులు రూ.6.50 లక్షలు కేటాయించామన్నారు. ఎస్పీ కె.వి.మురళీకృష్ణ మాట్లాడుతూ జిల్లాలోని పోలీస్‌స్టేషన్లకు వీటిని అందిస్తామని, ఈ సందర్భంగా సంస్థ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ(పరిపాలన)బి.విజయభాస్కర్, కంపెనీ ప్రతినిధులు ప్రభాకర్, కుల్లాయిరెడ్డి, సుబ్బారెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ప్లస్ టూ స్కూళ్ల పీజీటీలకు కౌన్సెలింగ్


విశాఖ విద్య : ఉమ్మడి విశాఖ జిల్లాలోని హైస్కూల్ ప్లస్–2 స్కూళ్లలో పీజీటీలుగా స్కూల్ అసిస్టెంట్లను నియమించేందుకు ఈనెల 20న ఉదయం 11 గంటలకు డీఈవో కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీఈవో ఎల్.చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా శుక్రవారం కౌన్సెలింగ్ అని ప్రకటించామని, అయితే దీనిని 20కు మార్పు చేసినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు ఈ మార్పును గమనించాలని సూచించారు. ధ్రువీకరణ పత్రాల పరిశీలన శుక్రవారం విశాఖ డీఈవో కార్యాలయంలో ఉంటుందన్నారు.

ఫణిభూషణ్ శ్రీధర్‌కు మరో పురస్కారం



అనకాపల్లిటౌన్ : పట్టణానికి చెందిన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్‌కు రాష్ట్ర జీవ వైవిధ్య సంరక్షణ అవార్డు వరించింది. జీవ వైవిధ్యంపై విత్తన బ్యాంకుల ఏర్పాటు, విత్తన బంతులు, జీవ వైవిధ్య రిజిస్టర్ల తయారీ, జీవ వైవిధ్య సంరక్షణ, ఔషధ మొక్కల యూనిట్ల ఏర్పాటు, పంపిణీ, పక్షుల గూళ్లు, ఉచితంగా పక్షులకు తిండిగింజలు, తాగునీటి మట్టిపాత్రల ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పించినందుకు గాను ఈ పురస్కారం దక్కింది. అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 22న తిరుపతి వెంకటేశ్వర వెటర్నరీ విశ్వవిద్యాలయంలో శ్రీధర్ ఈ అవార్డు అందుకోనున్నారు. అవార్డు ప్రదానోత్సవానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.నారాయణస్వామి, పర్యావరణ, అటవీశాఖమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, టూరిజం శాఖ మంత్రి కె.రోజాలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యే వేదికపై, వారి చేతులమీదుగా శ్రీధర్ అవార్డు అందుకోనున్నారు.

వడ దెబ్బకు ఉపాధి కూలీ మృతి



సత్యారావు(ఫైల్)

రావికమతం: చినపాచిల గ్రామానికి చెందిన పిల్లా సత్యారావు(48) ఉపాధి పనులు చేస్తూ గురువారం సొమ్మసిల్లి పడిపోయాడు. ఇంటికి తీసుకు వచ్చి సపర్యలు చేసినప్పటికీ మృతి చెందాడు. ఆ గ్రామంలోని ఉపాధి పనుల్లో పాల్గొన్న సత్యారావు ఉదయం 10 గంటల ప్రాంతంలో ఎండ దెబ్బకు సొమ్మసిల్లిపడిపోయాడు. దీంతో కొంతమంది జాబ్ కార్డుదారులు అతనిని ఇంటికి తీసుకువచ్చారు. బంధువులు సపర్యలు చేశారు. కాస్త తేరుకున్నాక ఆస్పత్రికి తీసుకువెళ్లేందుకు సమాయత్తం అవుతుండగా సాయంత్రం మృతి చెందినట్టు బంధువులు తెలిపారు. సత్యారావుకు వివాహం కాలేదు. తల్లి, సోదరుడు ఉన్నారు.

కేజీహెచ్‌లో పిల్లల వార్డు తనిఖీ

మహారాణిపేట (విశాఖ): ఎండల తీవ్రత నేపథ్యంలో పిల్లల వార్డును కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ గురువారం తనిఖీ చేశారు. అధిక ఉష్ణోగ్రతలు, వడగాడ్పుల వస్తున్న నేపథ్యంలో వార్డులో ఏసీలు పనిచేస్తున్నాయా? లేదా అన్నది తనిఖీ చేశారు. వార్డులో అన్ని ఏసీలను సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్ కుమార్ పరిశీలించారు. అలాగే అలాగే ఎన్‌ఐసియూ విభాగంలో ఫీడింగ్ ఇచ్చే పిల్లల తల్లుల కోసం రికవరీ రూమ్ ఏర్పాటు చేశారు. అక్కడ తల్లులకు అవసరమయ్యే మ్యాట్స్‌ను కూడ కేజీహెచ్ ఆర్‌ఎంవో డాక్టర్ అనురాధ పరిశీలించారు.

మన్యంలో కొలువుదీరనున్న శ్రీనివాసుడు

- 22న ఆలయ ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు
- టీటీడీ ఎగ్జిక్యూటివ్ అధికారి ఏవీ ధర్మారెడ్డి
- 21 వరకు మహా సంప్రోక్షణ



హోమం నిర్వహిస్తున్న టీటీడీ అర్చకులు

రంపచోడవరం: మండలంలో ఐ.పోలవరం జంక్షన్ సమీపంలోని మెట్టపై కలియుగదైవం శ్రీనివాసుడు కొలువుదీరనున్నారు. ఈమేరకు ఆలయ ప్రారంభానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తిరుమల తిరుపతి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ అధికారి ఏవీ ధర్మారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలోని గిరిజన ప్రాంత ప్రజలకు వేంకటేశ్వరస్వామి ఆశీస్సులు లభించేలా ఈనెల 22వ తేదీన ఆలయాన్ని ప్రారంభిస్తామని చెప్పారు. దీనిలో భాగంగా ఈనెల 17వ తేదీ నుంచి ప్రారంభమైన మహా సంప్రోక్షణ 21వ తేదీ వరకు జరుగుతుందన్నారు. మరుసటిరోజు 22వ తేదీన ఆలయాన్ని ప్రారంభించిన అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పిస్తామని తెలిపారు. అదేరోజు సాయంత్రం ఐదు గంటల నుంచి స్వామివారి కల్యాణోత్సవం జరుగుతుందన్నారు. ఈ ఉత్సవానికి భక్తులు హాజరుకావచ్చని ఆయన తెలిపారు. ఆలయ ప్రారంభంపై టీటీడీ ఏర్పాటు చేసిన వాహనం ద్వారా ఈనెల 17నుంచి గిరిజన గ్రామాల్లో విస్తృత ప్రచారం చేపట్టినట్టు ఆయన పేర్కొన్నారు.

టీటీడీ అర్చకుల ఆధ్వర్యంలో..

మహా సంప్రోక్షణలో భాగంగా టీటీడీ అర్చకులు వేద మంత్రాల మధ్య హోమం, పూజలు నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు పంచగవ్యప్రాసన, వాస్తు హోమం, అకల్మష ప్రాయశ్చిత్త హోమం, రక్షాబంధనం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు అగ్ని ప్రతిష్ఠ, కుంభ స్థాపన, కుంభారాధన, విశేష హోమాలు జరిగాయి. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు భక్తి సంగీత కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవోలు గుణభూషణ్ రెడ్డి, వెంకటయ్య, శివప్రసాద్, శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు, డీఈ ఆనందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

దూరవిద్య కేంద్రం పరీక్షల నోటిఫికేషన్ విడుదల

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం నుంచి నిర్వహించే యుజి, పి.జి, ప్రొఫెషనల్, డిప్లమా, పీజీ డిప్లమా, కంప్యూటర్ సర్టిఫికెట్ కోర్సుల పరీక్షల నోటిఫికేషన్ విడుదల చేసినట్లు దూరవిద్య కేంద్రం ఇంచార్జి సంచాలకులు ఎం.వి.ఎస్ చంద్రశేఖర రావు తెలిపారు. 2020-21, 2021-22, 2022-23 విద్యాసంవత్సరంలో ప్రవేశం పొందిన వారు 2017-18 విద్యా సంవత్సరం తరువాత చేరిన బ్యాక్‌లాగ్‌లు ఉన్న విద్యార్థులు సైతం ఈ పరీక్షలకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. జూన్ 10వ తేదీలోగా ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ 500 అపరాధ రుసుంతో జూన్ 15వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తారు. రూ.2000 అపరాధ రుసుముతో జూన్ 20వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తారు. పరీక్షలకు దరఖాస్తులను ఆన్‌లైన్ విధానంలో మాత్రమే స్వీకరిస్తామన్నారు. పూర్తి వివరాలకు వెబ్‌సైట్ www.andhrauniversity.sde. com , 0891 2844163, 2844164,2754966 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పరీక్షల తేదీలు

డిగ్రీ మూడో సంవత్సరం, ఎంబీఏ, ఎంసీఏ మూడో సంవత్సరం పరీక్షలు జూలై 3వ తేదీ నుంచి ఉదయం 9 నుంచి 12 గంటల వరకు నిర్వహిస్తారు. డిగ్రీ ద్వితీయ సంవత్సరం, ఎంబీఏ, ఎంసీఏ, ఇతర పీజీ కోర్సుల ద్వితీయ సంవత్సరం పరీక్షలు జూలై 3వతేదీ నుంచి మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు నిర్వహిస్తారు. ప్రథమ సంవత్సరం యూజీ, పీజీ, డిప్లమా, పీజీ డిప్లమా, సర్టిఫికెట్ కోర్సుల పరీక్షలు జూలై 18 నుంచి మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు నిర్వహిస్తారు.

చందు సాహితీ పురస్కార ప్రదానం



చందు సాహితీ పురస్కారం ప్రదానం చేస్తున్న దాడి వీరభద్రరావు, కె.ఎస్.చలం

సీతంపేట (విశాఖ): ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ డీవీ సూర్యారావు సాహిత్యంలో నిష్ణాతులని మాజీ మంత్రి దాడి వీరభద్రరావు కొనియాడారు. చందు సాహితీ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో స్థానిక పౌరగ్రంథాలయంలో జరిగిన సభలో ఆచార్య కె.ఎస్.చలంతో కలిసి డి.వి.సూర్యారావుకు చందు సాహితీ పురస్కారాన్ని , పదివేల నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాహిత్య అభిలాష ఉన్నవారంతా ఒకప్పుడు వరహాలశెట్టి బుక్ సెంటర్‌లో కలిసేవారని గుర్తుచేశారు. అధ్యయనంలో మేటిగా నిలిచిన డాక్టర్ డి.వి.సూర్యారావు ఉత్తరాంధ్రకు గర్వకారణమన్నారు. డి.వి.సూర్యారావు రచయితగా ఒక వర్గానికే పరిమితం కాకుండా సమాజంలోని ఉన్న వివిధ కోణాలను తన రచనల్లో ఆవిష్కరించారని తెలిపారు. చదవడం కంటే రాయడం చాలా గొప్ప ప్రక్రియ దానిని సాధించడంలో సూర్యారావు విజయం సాధించారని ప్రశంసించారు. సాహితీవేత్తలు, నటులు, చలన చిత్ర, సాంస్కృతిక, సేవా , రాజకీయ రంగంలో ఉన్న నిష్ణాతుల గురించి తన రచనలు, వ్యాసాల ద్వారా సమాజానికి పరిచయం చెయ్యడం గొప్ప విషయమన్నారు. నేటి సమాజంలో ఉన్న చెడును స్పష్టంగా చెప్పగలిగే రచయితలు, రచనలు అవసరమన్నారు. పుస్తకం గొప్పదని, గ్రంథాలయాలు కనుమరుగవుతున్నాయి, వాటి పరిరక్షణకు సాహితీవేత్తలు నడుం బిగించాలన్నారు. సాహితీవేత్త చందు సుబ్బారావు మాట్లాడుతూ సాహితీవేత్తలను తాము ప్రోత్సహిస్తామని తెలిపారు. డాక్టర్ పి.గోపాలనాయుడు పురస్కార గ్రహీతను సభకు పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, ఆచార్య వెలమల సిమ్మన్న, మేడా మస్తాన్‌రెడ్డి, అడపా రామకృష్ణ, ఎల్.ఆర్.స్వామి, శేఖరమంత్రి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు చంద్రబాబుకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ నిరసన

అనకాపల్లి టౌన్: 'మీకిచ్చే సెంటు భూమి శవం పూడ్చడానికి సరిపోతుందం'టూ టీడీపీ నేత చంద్రబాబు చేసిన అహంకారపూరిత వ్యాఖ్యలను ఖండిస్తూ శుక్రవారం స్థానిక నెహ్రూచౌక్ కూడలిలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిరసన తెలియజేస్తున్నట్టు ఎంపీపీ గొర్లి సూరిబాబు గురువారం పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ఎంపీటీసీ, సర్పంచ్‌లు, పార్టీ శ్రేణులు సొంతిళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులతో హాజరుకావాలని ఆయన కోరారు.

ఏయూకు మరొక ఐపీ గుర్తింపు



వీసీ ప్రసాదరెడ్డికి ఉత్తర్వులు అందజేస్తున్న ఆచార్య జేమ్స్ స్టీఫెన్

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం నుంచి వచ్చిన ఒక ఆవిష్కరణకు మేధో హక్కుల (ఐపీ) గుర్తింపు లభించింది. వాటర్ ఫిల్టర్ కాట్రిడ్జ్ డిజైన్‌కు గాను ఐపీ గుర్తింపు లభించింది. దీనికి సంబంధించిన అధికారిక ఉత్తర్వులు ఏయూకు అందాయి. ఈ సందర్భంగా దీనికి రూపకల్పన చేసిన వారిని వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో అభినందించారు. వర్సిటీ తరఫున వాటర్ ఫిల్టర్ కాట్రిడ్జ్ డిజైన్‌కు గుర్తింపునిచ్చారు. ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, కె.వెంకట కిరణ్, కె.రాజ్ కుమార్‌లు డిజైన్ రూపకల్పన చేయడం జరిగింది. వీరి డిజైన్‌ను రిజిస్ట్రేషన్ చేస్తూ అధికారిక ఉత్తర్వులను భారత ప్రభుత్వ దిపేటెంట్ ఆఫీస్ జారీ చేసింది. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఐపీఆర్ చెయిర్ ప్రొఫెసర్ డాక్టర్ హనుమంతు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

జ్యోతికి మరో స్వర్ణం

విశాఖ స్పోర్ట్స్ : జాతీయ ఫెడరేషన్ కప్ సీనియర్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో విశాఖ అథ్లెట్ జ్యోతి ఎర్రాజీ మరోస్వర్ణాన్ని కైవసం చేసుకుంది. రాంచీలోని బిర్సా ముండా స్టేడియంలో గురువారం జరిగిన మహిళల 200 మీటర్ల పరుగును 23.42 సెకన్లలో గమ్యాన్ని చేరి జ్యోతి (ఆంధ్రప్రదేశ్) విజేతగా నిలిచి స్వర్ణాన్ని అందుకుంది. అర్చన సుసేన్ (తమిళనాడు) 23.61సెకన్లలోనూ, హిమాని చందల్ (మధ్యప్రదేశ్) 24.33 సెకన్లలో పూర్తి చేసి వరుసగా ద్వితీయ, తృతీయస్థానాల్లో నిలిచారు. సిమ్రాన్‌దీప్ కౌర్ (ఢిల్లీ), దనేశ్వరి (కర్నాటక), అంజలి(కేరళ), మధుమిత (ఒడిస్సా), శుభమ్ (హర్యానా) వరుసగా నాలుగో స్థానం నుంచి ఎనిమిదో స్థానాల్లో నిలిచారు. ప్రిలిమ్స్ హీట్‌లో జ్యోతి 23.47సెకన్లలో పూర్తి చేసి ఫైనల్స్‌కు క్వాలిఫై అయింది. జాతీయ రికార్డు హోల్డర్ జ్యోతి బుధవారం జరిగిన వంద మీటర్ల హార్డిల్స్‌ను 12.89 సెకన్లలోనే పూర్తి చేసి స్వర్ణం సాధించిన విషయం విధితమే. దీంతో జ్యోతి పాల్గొన్న రెండు అంశాల్లో విజేతగా నిలిచి రెండు స్వర్ణాలందుకుంది. దీంతో జూలై 12–16 వరకు బాంకాంక్‌లో జరిగే ఆసియన్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌పై దృష్టి పెట్టింది.

నేటి నుంచి స్టేట్ యూత్ బాక్సింగ్ పోటీలు

విశాఖ స్పోర్ట్స్: స్టేట్ యూత్ మెన్, వుమెన్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ శుక్రవారం నుంచి నాలుగు రోజుల పాటు రైల్వే ఇండోర్ బాక్సింగ్ హాలులో జరగనుంది. మెన్‌లో వంద మంది, వుమెన్‌లో 50 మంది వరకు వివిధ వెయిట్ కేటగిరీల్లో పోటీ పడనున్నారు. ఈకోర్స్ వాల్తేర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ పోటీల పోస్టర్‌ను గురువారం డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి విడుదల చేశారు. మెడికల్ వేయింగ్‌ను శుక్రవారం తీసుకుని కేటగిరీలు నిర్ణయిస్తారు. శనివారం నుంచి బౌట్స్ ప్రారంభం కానున్నాయి. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం మనోజ్‌కుమార్, క్రీడాధికారి ప్రవీణ్‌భాటి, ఎస్‌డీఈ మోహనరావు, కోశాధికారి అవినాష్, ధ్యాన్‌చంద్ అవార్డు గ్రహీత ఎస్.ఉష, శ్రీనివాసరావు, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

విస్తరణకు కసరత్తు

- వంద అడుగులు కానున్న మెయిన్ రోడ్డు
- యజమానులకు నోటీసులు



విస్తరించనున్న మెయిన్ రోడ్డు

నర్సీపట్నం: డివిజన్ కేంద్రమైన నర్సీపట్నం మెయిన్ రోడ్డు విస్తరణకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. దీనిలో భాగంగా మున్సిపల్ అధికారులు భవన యజమానులకు, వ్యాపారులకు తాత్కాలిక నోటీసులు జారీ చేశారు. ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అభ్యర్థన మేరకు మెయిన్ రోడ్డు విస్తరణకు సీఎం జగన్మోహన్‌రెడ్డి నిధులు మంజూరు చేసి, గత ఏడాది డిసెంబర్‌లో శంకుస్థాపన చేశారు. వంద అడుగులకు విస్తరించేందుకు కౌన్సిల్ నిర్ణయం తీసుకున్నారు. వంద అడుగులు కాకుండా 80 అడుగులకు విస్తరించాలంటూ భవన యజమానులు రోడ్డెక్కారు. మెయిన్ రోడ్డు విస్తరణ వివాదాస్పదంగా మారింది. దీంతో రోడ్డు విస్తరణ జరుగుతుందా లేదా అని ప్రజల్లో సందిగ్ధం నెలకొంది. నోటీసులు జారీ చేయడంతో సందిగ్ధతకు తెరపడింది. పట్టణంలో మెయిన్ రోడ్డు విస్తరణతో పాటు లింక్ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.16.60 కోట్లు మంజూరు చేసింది. యజమానులు, ప్రజాప్రయోజనాల దృష్ట్యా వంద అడుగులకు విస్తరించేందుకు కౌన్సిల్‌లో ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నారు. న్యాయపరమైన అడ్డంకులు తలెత్తకుండా రోడ్డు డెవలప్‌మెంట్ ప్లాన్ (ఆర్‌డీపీ)కు ఆమోదం లభించింది. రోడ్డు విస్తరణ బాధితులు 229 మంది ఉండగా 163 మందికి నోటీసులు జారీ చేశారు. మిగిలిన వారు ప్రభుత్వ, దేవదాయ, మున్సిపల్ స్థలాల ఆక్రమణలో ఉండటంతో ఆ స్థలాలను స్వాధీన పరుచుకునేందుకు చర్యలు చేపట్టారు. చట్టంలో పేర్కొన్న విధంగా బాధితలకు నష్టపరిహారంగా నగదుకు బదులు టీడీఆర్ బాండ్లు జారీ చేయనున్నారు.

పారదర్శకంగా రోడ్డు విస్తరణ..



ఆమోదం పొందిన ఆర్‌డీపీ ప్రకారం 229 మంది బాధితులకు గాను 163 మందికి నోటీసులు జారీ చేశాం. 15 రోజుల్లో తొలగింపునకు స్వచ్ఛందంగా అంగీకారం తెలపాలి. లేదంటే రిమూవల్ ఆర్డర్ జారీ చేసి విస్తరణకు అడ్డంకిగా ఉన్న వాటిని తొలగించి, ఖర్చులను సైతం యజమానుల నుండి రికవరీ చేస్తాం. నష్టపరిహారంగా నగదుకు బదులు టీడీఆర్ బాండ్లు ఇస్తాం.

కె.కనకారావు, మున్సిపల్ కమిషనర్

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీలో చేరిన జనసేన కార్యకర్తలు



పార్టీ కండువా వేసి జనసేన కార్యకర్తలను ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని ఎస్‌ఈజెడ్ కాలనీ దిబ్బపాలెంలో వార్డు మెంబర్ గుర్రం సూరిబాబు ఆధ్వర్యంలో 20 మంది జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి గురువారం ఎమ్మెల్యే కన్నబాబు వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దేశంశెట్టి శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి ఉద్యోగుల రిలే దీక్షలు

అనకాపల్లి రూరల్ : సమస్యల పరిష్కారం కోసం ఈనెల 22 నుంచి రిలే దీక్షలు చేపట్టాలని ప్రభుత్వ ఉద్యోగులు నిర్ణయించారు. గురువారం అనకాపల్లి మండల పరిషత్ సమావేశ మందిరంలో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గం, జిల్లాలోని తొమ్మిది తాలూకా యూనిట్ల కార్యవర్గాలకు చెందిన అధ్యక్ష, కార్యదర్శులు అత్యవసరంగా సమావేశమయ్యారు. రాష్ట్ర కార్యవర్గం పిలుపు మేరకు సమావేశమైన వీరంతా పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిరశన తెలియజేయడానికి కార్యాచరణ రూపొందించారు. ఈ నెల 22 నుంచి 31 వరకు జిల్లాలో తాలూకా యూనిట్ల వారీగా రిలే దీక్షలు చేపట్టడానికి నిర్ణయించారు. సమావేశంలో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్ కె బాబూరావు, జిల్లా కార్యదర్శి ఐ.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు, కార్యనిర్వాహక కార్యదర్శి నాగేశ్వరరావు, యలమంచిలి, కె.కోటపాడు, సబ్బవరం, నర్సీపట్నం, కోటవురట్ల, నక్కపల్లి, చోడవరం, మాడుగుల, అనకాపల్లి యూనిట్ల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక నెలవు.. దేవతల కొలువు

- చోడవరం శ్రీస్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయానికి రాజగోపురాల శోభ
- రూ. 3 కోట్లతో నిర్మాణం
- 4 నుంచి 7 వరకు మహోత్సవాలు

చోడవరం: జిల్లాలో ఆధ్యాత్మిక కేంద్రంగా చోడవరం మరింత అభివృద్ధి చెందుతోంది. కాణిపాకం తర్వాత అంతటి ప్రాముఖ్యత సంతరించుకుని చోడవరంలో స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయం ఈ ప్రాంతంలో ఎంతో ప్రాచుర్యం కలిగి ఉంది. ఇప్పుడు ఆలయానికి మూడు దిక్కులా రాజగోపురాల నిర్మాణంతో కొత్తశోభ సంతరించుకుంది. ప్రాచీన మత్స్యరాజుల కాలంనాటి కోనేరు కలిగిన స్వయంభూ గౌరీశ్వరస్వామి, 800 ఏళ్ల నాటి శ్రీ కేశవస్వామి ఆలయాలు ఇక్కడే ఉన్నాయి. గత ప్రభుత్వాల హయాంలో ఈ ఆలయాలు అభివృద్ధి లేకుండా ఉండిపోయాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ప్రత్యేక చొరవతో ఈ ప్రాచీన దేవాలయాల అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ఇక్కడి స్వయంభూ విఘ్నేశ్వర స్వామి ఆలయానికి గతంలో ఉత్తర ముఖద్వారం మాత్రమే ఉండేది. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఈ ఆలయానికి అభివృద్ధి కమిటీ, ఆలయ కమిటీలు ఏర్పాటు చేసి ఆలయానికి మిగతా మూడు పక్కలా రాజగోపురాలతో ముఖద్వారాలు నిర్మించారు. సుమారు రూ. 3 కోట్లకు పైబడే ఖర్చు చేసి ఈ నిర్మాణాలు చేపట్టారు. ఇందుకుగాను తొలుత విప్ ధర్మశ్రీ రూ. 40 లక్షల నిధులు ప్రభుత్వం మంజూరు చేసేలా కృషి చేశారు. నిధులు మంజూరైన తర్వాత తూర్పు రాజగోపుర నిర్మాణం మొదలు పెట్టారు. అటు పిమ్మట దాతలు కూడా ముందుకొచ్చి సహకరించడంతో ఆలయాభివృద్ధికి రూ. 3 కోట్లకు పైగా వెచ్చించారు. ఆధ్యాత్మికత ఉట్టిపడే విధంగా ఇతిహాసాలను అనుసరించి ఈ విగ్రహాలను ఇక్కడి రాజగోపురాలపై నెలకొల్పారు. ప్రముఖ ఆలయాల నిర్మాణ శిల్పకారుడు చిన్న పర్యవేక్షణలో ఈ రాజగోపురాలు నిర్మించారు. ఇప్పటికే వీటిలో తూర్పు, పశ్చిమ రాజగోపురాల నిర్మాణం పూర్తి కాగా వీటికి ప్రధాన ముఖద్వారాలు కూడా భారీ ఎత్తున ఏర్పాటు చేశారు. వచ్చేనెల 4 నుండి 7 వరకు రాజగోపురాల కలశ ప్రతిష్టా మహోత్సవాలు జరగనున్నాయి. మెయిన్‌రోడ్డుకు అనుకుని ఈ ఆలయం ఉండటంతో కొత్తగా నిర్మించిన తూర్పు రాజగోపురం నుంచి ఇకపై భక్తులు ఆలయంలోకి ప్రవేశించేలా ఏర్పాట్లు చేశారు. ఈ మూడేళ్లలో ఎంతో అభివృద్ధి జరుగుతుండటంతో ఇప్పుడు చోడవరం ఆధ్యాత్మిక క్షేత్రంగా మరింత శోభతో కనువిందు చేస్తోంది. ఆలయాల అభివృద్ధిపై భక్తులంతా ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



రాజగోపురాల ఏర్పాటుతో నూతన శోభ సంతరించుకున్న శ్రీ స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయం

ఆధ్యాత్మికతతో మిళితమైన చోడవరం చరిత్ర



ఉత్తరాంధ్ర జిల్లాల పుణ్యక్షేత్రాల్లో ఒకటైన చోడవరం శ్రీ స్వయంభూ విఘ్నేశ్వరస్వామివారి ఆలయాన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టాం. చోళరాజుల నాటి కాలంలో ఈ గ్రామానికి ఎంతో ప్రత్యేకత ఉంది. సాహిత్యపరంగా కూడా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నాం. ఇక్కడి హార్డింజ్ గెస్ట్ హౌస్ ఆవరణలో కళాభారతి ఆడిటోరియం నిర్మించాలని ప్రతిపాదన చేశాం. త్వరలో నిధులు మంజూరు చేయించి ఆడిటోరియం నిర్మిస్తాం.

– కరణం ధర్మశ్రీ, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే, చోడవరం

నాలుగు రాజగోపురాలతో పుణ్యక్షేత్రంగా..



ప్రధాన ఆలయానికి నాలుగు రాజగోపురాలు నిర్మించడం వల్ల ఆలయం పుణ్యక్షేత్రంగా మారుతుంది. నాలుగు గోపురాల ద్వారా మాడవీధుల్లో స్వామివారి ఊరేగింపు నిర్వహించడం వల్ల ఆలయానికి దైవ సంకల్పబలం రెట్టింపు అవుతుంది. 20 ఏళ్లగా తూర్పు దిశతో పాటు మిగతా మూడు దిశల్లో రాజగోపురాలు నిర్మించాలని ప్రయత్నిస్తున్నా నేటికి కార్యరూపం దాల్చింది. ప్రోత్సహించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు.

–కొడమంచిలి చలపతిరావు, ప్రధాన అర్చకుడు

స్టోన్‌క్రషర్ల ఏర్పాటుపై గ్రామసభ



మామిడిపాలెంలో సభలో మాట్లాడుతున్న డీఆర్వో వెంకటరమణ

అనకాపల్లిటౌన్: మండలంలో కుంచంగి గామంలో గురువారం స్టోన్‌క్రషర్ ఏర్పాటుకు గ్రామసభ జరిగింది. ఈ సభకు డీఆర్వో వెంకటరమణ, మైన్స్ ఏడీ సుబ్బారాయుడు హాజరయ్యారు. మెసర్స్ ఎస్‌వీసీ మినరల్స్ ప్రైవేటు లిమిటెడ్, సర్వే నంబర్ 316లో 4.950 హెక్టార్ల విస్తీర్ణంలో రోడ్‌మెటల్, బిల్డింగ్ స్టోన్ మైనింగ్ చేపట్టాలంటూ అనుకూలంగా పర్యావరణ అనుమతులు కోరుతూ సభ జరిగింది. ఈ సభలో గ్రామస్తులు క్వారీ కారణంగా దెబ్బతినే గ్రామాలను అభివృద్ధి చేయాలని సభ దృష్టికి తీసుకొచ్చారు. మండలంలో మామిడిపాలెం గ్రామంలో కోన శ్రీనివాసరావు స్టోన్‌క్రషర్ ఏర్పాటుపై గ్రామస్తులు వ్యతిరేకించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పదేళ్లుగా క్వారీ నిర్వహణ తీరు పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. క్వారీ యాజమాన్యం గ్రామాభివృద్ధికి ఏ మాత్రం సహకరించలేదని, దుమ్ము, ధూళి నియంత్రణకు ఎటువంటి క్వారీ చర్యలు చేపట్టడం లేదంటూ గ్రామస్తులు భీష్మించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గంగాధరరావు, ఆర్ఐ రమేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

- రేపు పరీక్ష నిర్వహణ
- కలెక్టర్ సుమిత్‌కుమార్



సాక్షి, పాడేరు: ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని గిరిజన సంక్షేమశాఖ గురుకులాల్లో ఐదవ తరగతి, రాష్ట్రంలోని పలు గురుకుల కళాశాలల్లో ఇంటర్, డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి ఈ నెల 20న నిర్వహించే ప్రవేశపరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. విజయనగరం జిల్లా తాటిపూడి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వి.వి.రాజేంద్రప్రసాద్‌ను పరీక్షల సమన్వయకర్తగా నియమించినట్లు ఆయన తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి పి.అంబేద్కర్, జిల్లా విద్యాశాఖాధికారి సలీంబాషా పర్యవేక్షణలో ప్రవేశపరీక్ష జరుగుతుందన్నారు. ఐదవ తరగతిలో ప్రవేశానికి 494 మంది, ఇంటర్, డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి 1132 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. పాడేరు గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలలోని రెండు కేంద్రాల్లో, ఐదవ తరగతి ప్రవేశ పరీక్ష ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతుందన్నారు. ఇంటర్, డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్ష ఆ రెండు సెంటర్లతో పాటు, పాడేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, తలారిసింగి ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల (బాలురు) కేంద్రాల్లో జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఈ పరీక్ష జరుగుతుందని, ప్రవేశ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సంబంధిత వెబ్ సైట్ నుంచి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. పరీక్ష సమయానికి గంట ముందు అభ్యర్థులు సంబంధిత పరీక్ష కేంద్రానికి హాజరు కావాలని కలెక్టర్ సూచించారు.

సమ్మర్ సరదా..



తాటి కాయలు తీసుకువస్తున్న చిన్నారులు



ఈత కాయల సేకరణలో చిన్నారులు

ఎటపాక: సమ్మర్ సరదాల్లో చిన్నారులు మునిగిపోయారు. తోటి స్నేహితులతో కలిసి పల్లెల్లో ఆట పాటలతో ఆనందాలు పంచుకుంటున్నారు. వేసవిలో దొరికే ఈత పండ్లు,తాటి ముంజలు వేటలో నిమగ్నమయ్యారు. స్నేహితులతో కలిసి ఈత చెట్లు ఎక్కి పండ్లు కోసి వాటిని పంచుకుని తింటున్నారు. తాటి కాయలు తెచ్చుకుని చెట్ల నీడలో కూర్చుని తింటున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



గాయపడిన లోవ

కోటవురట్ల: నర్సీపట్నం మండలం ధర్మసాగరం గ్రామానికి చెందిన జోగ లోవ అనే వ్యక్తి నక్కపల్లి మండలం వేంపాడు నుంచి పల్సర్ బైక్ వస్తూ ప్రమాదానికి గురయ్యాడు. బుధవారం అర్ధ రాత్రి సుంకపూరు జంక్షన్‌కు సమీపంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. నల్లమారమ్మ తల్లి ఆలయంలో వద్ద ఉన్న చెట్టు సిమెంట్ దిమ్మను వేగంగా వచ్చి ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. తలకు, కాళ్లకు గాయాలు కావడంతో 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు.

నాడు కమీషన్లు తిని...నేడు మాపై విమర్శలా..!

- ఎత్తిపోతల పథకంపై టీడీపీ నేతల రాజకీయం సిగ్గుచేటు
- వైఎస్సార్‌సీపీ నాయకుల ధ్వజం



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బుచ్చెయ్యపేట: మండలంలోని ఎల్‌బీ పురం, బంగారుమెట్ట గ్రామాల్లో ఎత్తిపోతల పథకంపై టీడీపీ నాయకులు రాజకీయం చేయడం సిగ్గుచేటని వైఎస్సార్‌సీపీ నాయకులు ధ్వజమెత్తారు. గురువారం ఎల్‌బీ పురంలో బంగారుమెట్ట కోఆపరేటివ్ పర్సన్ ఇన్‌ఛార్జి సాయం రమేష్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, వడ్డాది వైఎస్సార్‌సీపీ టౌన్ అధ్యక్షుడు దొండా నారాయణమూర్తి, మండల రైతు విభాగం అధ్యక్షుడు తమరాన వెంకట రమణ, లోపూడి సచివాలయ కన్వీనర్ యెనుముల వాసు, రైతు సంఘ నాయకులు దొండా కుమార్, సాయం వరహాలబాబు తదితరులు విలేకరుల సమావేశంలో టీడీపీ నాయకుల విమర్శలపై మండిపడ్డారు.

పదేళ్ల క్రిందట లోపూడిలో సైనిక శిక్షణ కేంద్రం ఏర్పాటులో భూములు కోల్పోయిన నిర్వాసిత రైతులను ఆదుకుంటామని అప్పటి టీడీపీ ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు రైతులకు హామీ ఇచ్చారన్నారు. ఎత్తిపోతల పథకం మంజూరు చేసి మెరక ప్రాంతాల పొలాలకు సాగునీరు అందిస్తామని రూ.నాలుగున్నర కోట్లు మంజూరు చేయించారన్నారు. అయినా పనులు మూడేళ్ల కాలంలో పూర్తి చేయకుండా ఆ నిధులను పర్సంటేజీల రూపంలో వాటాలు పంచుకోవడానికే శ్రద్ధ చూపారన్నారు.

రైతుల సంతకాలు ఫోర్జరీ

ఎత్తిపోతల పథకం నిర్మాణానికి కొందరు రైతుల సంతకాలను టీడీపీ నాయకులే ఫోర్జరీ చేసి తప్పుడు తీర్మానాలు చేశారని, చేతనైతే అప్పటి తీర్మానాల సంతకాలను బయటపెట్టాలని వైఎస్సార్‌సీపీ నేతలు డిమాండ్ చేశారు. ఎత్తిపోతల పథకం పేరు చెప్పి ఒక్కో రైతు నుంచి ఎకరాకు రూ.3 వేలు చొప్పున టీడీపీ నాయకులు డబ్బులు వసూలు చేశారన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన రూ.4.50 కోట్లకు, రైతుల నుంచి వసూలు చేసిన మొత్తం డబ్బులకు టీడీపీ నాయకులు ఇపుడు లెక్కలు చెప్పాలన్నారు. రాష్ట్రంలో ఎత్తిపోతల పథకాలు ఎక్కడా సక్రమంగా పనిచేయకపోగా తమిళనాడు వంటి ఇతర రాష్ట్రాల్లో ఎత్తిపోతల పథకాల నిర్వహణ లేక మూసి వేయించారన్నారు. నిజంగా టీడీపీ నాయకులకు రైతులపై ప్రేమే ఉంటే వారికి జలసిరి పథకం అమలు చేసేవారన్నారు.

జలసిరి బోర్లకు ఒక్కో రైతుకు లక్ష రూపాయలు అందించినా 110 మంది రైతులకు రూ.కోటి 10 లక్షలు నిధులు ఖర్చయి, ప్రభుత్వానికి మూడు కోట్లకు పైగా నిధులు మిగిలేవని, రైతుల మెట్ట పొలాలకు పుష్కలంగా సాగునీరు అందేదని అన్నారు. కానీ టీడీపీ నాయకులు కమీషన్లకు ఆశపడి ఎత్తిపోతల పథకం పేరుతో నిధులు దుర్వినియోగం చేశారన్నారు. ఆ పథకానికి తెచ్చిన గొట్టాలను సైతం టీడీపీ నాయకులు సొంత పొలాలకు వాడుకున్నారని విమర్శించారు. రైతులకు తెలియకుండా వారికి పరిహారం ఇవ్వకుండా జిరాయితీ భూముల్లో నుంచి ఎత్తిపోతల పథకం పనులు చేయడంపై కొందరు రైతులు న్యాయం చేయాలని కోర్టును ఆశ్రయించారన్నారు. రైతులు అడ్డుతగిలారని పనులు ఆపేశారు తప్ప ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి ఎత్తిపోతల పథకం పనులను పూర్తి చేయలేకపోయారన్నారు. రైతుల పేరు చెప్పుకుని నాడు ఎత్తిపోతల పథకం పనులను పూర్తి చేయకుండా గాలికొదిలేసి, ఇపుడు వైఎస్సార్‌సీపీ నాయకులను విమర్శించడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఎత్తిపోతల పథకానికి అర కిలోమీటరు దూరంలోనే వడ్డాదిలో మరో ఎత్తిపోతల పథకం మరమ్మతులకు గురైనా టీడీపీ నాయకులు తమ హయాంలో ఎందుకు బాగు చేయించలేదని ప్రశ్నించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

అనకాపల్లిటౌన్ : గుర్తు తెలియని వాహనం ఢీకొని చవితిన అప్పలకొండ(39) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. రూరల్ ఎస్ఐ నరసింగరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. బవులవాడకు చెందిన అప్పలకొండ గురువారం తెల్లవారి తన పొలంలోకి వెళ్తుండగా గ్రామ శివారున గుర్తు తెలియని వాహనం ఢీకొంది. మృతుడి తల్లి అప్పలనర్సమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

బ్యాంకర్లకు జీవీఎంసీ కమిషనర్ విజ్ఞప్తి

రుణాల మంజూరుకు సహకరించండి



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

డాబాగార్డెన్స్: టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు బ్యాంకు రుణాలు త్వరితగతిన మంజూరు చేయాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ వివిధ బ్యాంకుల అధికారులకు విజ్ఞప్తి చేశారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం జీవీఎంసీ పరిధిలోని అన్ని బ్యాంకుల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ త్వరలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దబ్బంద, సత్యనారాయణపురంలోని టిడ్కో ఇళ్లు ప్రారంభిస్తారని, ఈ నెలాఖరులోగా లబ్ధిదారులందరికీ బ్యాంకు రుణాల ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. లబ్ధిదారులందరూ పేదవారే కాబట్టి.. నిబంధనల పేరిట ఆంక్షలు విధించకుండా రుణాలు మంజూరుకు సహకరించాలన్నారు. మిగిలిన ఫేస్–1లో నిర్మిస్తున్న టిడ్కో ఇళ్లకు జూన్ 15లోపు రుణాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

లబ్ధిదారుల వివరాల జాబితాను జీవీఎంసీ అధికారులు బ్యాంకులకు అందజేస్తారని చెప్పారు. ఈ సందర్భంగా బ్యాంకు అధికారులందరూ లబ్ధిదారులకు రుణాలు మంజూరుకు సహకరిస్తామని కమిషనర్‌కు హామీనిచ్చారు. సమావేశంలో జీవీఎంసీ ప్రాజెక్టు డైరెక్టర్(యూసీడీ) పాపునాయుడు, సెంట్రల్ బ్యాంకు, యూనియన్ బ్యాంకు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంక్ లీడ్ మేనేజర్లు, రీజనల్ మేనేజర్లు పాల్గొన్నారు.

'మత్తు' ముఠా.. ఆటకట్టు

- నిషేధిత మత్తు పదార్థాలు విక్రయిస్తున్న ఐదుగురి అరెస్ట్
- మిగిలిన వారి కోసం పోలీసులు గాలింపు
- భారీ సంఖ్యలో ఇంజక్షన్లు స్వాధీనం



మత్తు ఇంజక్షన్లను పరిశీలిస్తున్న సీపీ త్రివిక్రమ్ వర్మ

అల్లిపురం: ప్రత్యేక పరిస్థితుల్లో.. వైద్యుల సూచన మేరకు మాత్రమే వినియోగించాల్సిన మత్తు ఇంజక్షన్లు నగరంలో కొంత మంది విక్రయిస్తుండటంతో.. పోలీసులు అప్రమత్తమయ్యారు. నిషేధిత మత్తు ఇంజక్షన్లు విక్రయిస్తున్న ముఠాపై ఎప్పటికప్పుడు దాడులు చేస్తూ.. అరెస్టులు చేస్తున్నారు. తాజాగా వేర్వేరు కేసుల్లో టూటౌన్, టాస్క్‌ఫోర్సు పోలీసులు, సెబ్ అధికారులు ఐదుగురిని అరెస్ట్ చేశారు. పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నగర పోలీస్ కమిషనర్ సీఎం త్రివిక్రమ్ వర్మ ఈ వివరాలు వెల్లడించారు. సమావేశంలో డీసీపీ–1 విద్యాసాగర్ నాయుడు, క్రైం డీసీపీ జి.నాగన్న పాల్గొన్నారు.

- కోల్‌కతా నుంచి పెంటాజోసిన్ లాక్టేట్ ఇంజక్షన్లు మధ్యవర్తుల ద్వారా గుంటు ఉమామహేష్ రూ.40కి కొనుగోలు చేసి.. నగరంలో రూ.60 నుంచి రూ.300 వరకు విక్రయిస్తున్నాడు. ఈ సమాచారం మేరకు సీతమ్మధార, పెందుర్తి సెబ్ అధికారులు దాడులు చేసి సీతమ్మధార కనకపువీధిలో 3 వేల మత్తు జంక్షన్లతో 60 బాక్సులను ఉమామహేష్ నుంచి స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు కోల్‌కతాకు చెందిన బీమాల్‌ను అరెస్ట్ చేయాల్సి ఉందని సీపీ తెలిపారు.
- పీఎంపాలెం, మధురవాడలో 100 పెంటాజోసిన్ లాక్టేట్ ఇంజక్షన్లతో రెండు బాక్స్‌లను నిందితుడు బెవర వెంకటేష్ నుంచి పెందుర్తి సెబ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అతనికి ఖరగ్‌పూర్‌కు చెందిన దుర్గాప్రసాద్ ఈ ఇంజక్షన్లు సరఫరా చేస్తున్నాడు. ఇటీవలే అతన్ని మహారాణిపేట, గోపాలపట్నం పోలీసులు రెండు కేసుల్లో అరెస్ట్ చేసి జైలుకు పంపించారు. అతను బెయిల్‌పై విడుదల అయినట్లు తెలిపారు.
- సీతమ్మధార, పీఎంపాలెం పోలీస్‌స్టేషన్ల పరిధిలో మత్తు ఇంజక్షన్లకు అలవాటు పడిన 14 మందిని అదుపులోకి తీసుకుని.. 'మార్పు' సెంటర్ ద్వారా కౌన్సెలింగ్ నిర్వహించారు.

టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో..

టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రైల్వేక్వార్టర్స్‌లో మత్తు ఇంజక్షన్లు విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్, టూటౌన్ పోలీసులు దాడి చేశారు. నిందితుడు కాళ్ల హరి పద్మ రాఘవరావు, పబ్బిశెట్టి రవి, కాకటా చిరంజీవిలను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 42 బాక్సుల్లోని 2,100 పెంటాజోసిన్ లాక్టేట్ ఇంజక్షన్లు, 21 కేజీల గంజాయి, నాలుగు సెల్‌ఫోన్లు, రూ.7 వేలు నగదు స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో పితాని అప్పలరాజ అలియాస్ చిన్నా, పితాని రవి, శ్యామ్, వానపల్లి జగదీష్‌లకు అరెస్ట్ చేయాల్సి ఉందన్నారు. వీరికి బీమాల్ కండేవాలా మత్తు ఇంజక్షన్లు సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. కాళ్ల హరి పద్మ రాఘవరావు అలియాస్ భీమిలి హరిపై భీమిలి పోలీస్ స్టేషన్‌లో 5, గోపాలపట్నం సెబ్‌లో ఒకటి, రాజమండ్రి వన్‌టౌన్ పీఎస్‌లో ఒకటి, టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఓ కేసు నమోదైంది. పబ్బిశెట్టి రవికుమార్‌పై టూటౌన్, ఎంవీపీ పోలీస్ స్టేషన్లలో పలు కేసులు నమోదయ్యాయని సీపీ తెలిపారు.

7,546 కిలోల గంజాయి స్వాధీనం

విశాఖ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో 2019 జనవరి 1వ తేదీ నుంచి 2023 మే 17వ తేదీ వరకు 191 కేసుల్లో 7546.23 కిలోల గంజాయి, 27.4 కిలోల గంజాయి ఆయిల్(హషీష్ ఆయిల్)ను స్వాధీనం చేసుకుందని సీపీ సీఎం త్రివిక్రమ్ వర్మ తెలిపారు. ఈ కేసుల్లో 473 మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. మత్తు పదార్థాల నియంత్రణలో సెబ్ పనితీరును ఆయన వివరించారు. 257 మంది గంజాయి రవాణా చేస్తున్నట్లు గుర్తించి వారిలో 200 మందిని అరెస్ట్ చేశామని, 49 మందిని డీ అడిక్షన్ కేంద్రాల ద్వారా కౌన్సెలింగ్ ఇచ్చామని వెల్లడించారు. మత్తు ఇంజక్షన్లు సరఫరా చేస్తున్న పశ్చిమ బెంగాల్‌కు చెందిన అనూప్ అధికారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. మత్తు మందులకు దూరంగా ఉండాలని నగరంలో 146 హోర్డింగ్‌లు ఏర్పాటు చేశామన్నారు. యూనివర్సిటీలు, ఇంజినీరింగ్, డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో మత్తు మందుల వినియోగం, నష్టాలపై అవగాహన సదస్సులు నిర్వహించినట్లు చెప్పారు. పాఠశాలలు, కళాశాలల్లో హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లు చైర్మన్లుగా 105 కమిటీలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. పరివర్తన కార్యక్రమంలో భాగంగా 9 గ్రామాల ప్రజలను గంజాయి సాగు నుంచి మళ్లించి.. సంప్రదాయ పంటలు సాగు చేసేలా ప్రోత్సహించినట్లు సీపీ వివరించారు.

ప్రభుత్వ స్కూళ్లు.. కార్పొరేట్ సొగసులు

విద్యాలయాలు.. పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దే ఆధునిక దేవాలయాలు. అందుకే సీఎం జగన్ ప్రభుత్వం సర్కారీ స్కూళ్లను ఆధునికీకరించేందుకు రూ.వేల కోట్లు వెచ్చిస్తోంది. ఒకప్పుడు దుంపల బడులుగా ఆక్షేపించే ప్రభుత్వ స్కూళ్లను.. ఇపుడు కార్పొరేట్‌ను తలదన్నే స్థాయికి తీసుకెళ్లారు. అనకాపల్లి పట్టణ, మండల పరిధిలో స్కూళ్లను మనబడి నాడు–నేడులో భాగంగా తీర్చిదిద్దుతున్నారు. రెండో దశలో 8 రకాల మౌలిక వసతుల్ని శరవేగంగా ఏర్పాటుచేస్తున్నారు.

- తొలి దశలో రూ.11.11 కోట్లతో 42 స్కూళ్ల అభివృద్ధి
- రెండో దశలో రూ.15.21 కోట్లతో 8 రకాల సౌకర్యాల కల్పన


కొత్తగా నిర్మించిన ఆధునిక టాయిలెట్లు


హైస్కూల్ ఆవరణలో పచ్చదనంతో ఆహ్లాదకర వాతావరణం (ఇన్‌సెట్) పాఠశాలలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్

అనకాపల్లిటౌన్ : సర్కారు బడులు కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా మారి, పేద విద్యార్థులకు ఉత్తమ వసతులతో కూడిన విద్యను అందిస్తున్నాయి. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పేద విద్యార్థికి మెరుగైన విద్య అందించాలనే సంకల్పంతో ప్రభుత్వ పాఠశాలల్ని తీర్చిదిద్దుతున్నారు. పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, తొడుక్కునే యూనిఫాం, వేసుకునే షూస్.. తీసుకునే మధ్యాహ్న భోజనం ఇలా ప్రతీదీ మెరుగ్గా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.

తొలి దశలో మెరుగైన వసతులు

పట్టణ, మండల పరిధిలో ప్రభుత్వ, జీవీఎంసీ యాజమాన్యంలో 75 స్కూళ్లున్నాయి. మనబడి నాడు నేడులో వీటిని దశలవారీగా అభివృద్ధి చేసేందుకు నిర్ణయించారు. తొలి దశలో రూ.11 కోట్ల 10 లక్షల 66 వేలతో 42 పాఠశాలల్ని అత్యాధునిక వసతులతో తీర్చిదిద్దారు. ఇందులో రూ.4.36 కోట్లతో 25 ప్రాథమిక పాఠశాలలు, రూ.కోటీ 44 లక్షలతో 7 ప్రాథమికోన్నత పాఠశాలలు, రూ.5.31 కోట్లతో 10 హైస్కూళ్లను ఎవరూ ఊహించని స్థాయిలో అభివృద్ధి చేశారు. సాధారణ, మధ్య తరగతి ప్రజల ఇళ్లల్లో కలలోనైనా ఏర్పాటు చేసుకోని వసతుల్ని కల్పించారు. ఆహ్లాదకర వాతావరణం ఉండేలా స్కూల్ ఆవరణలో పచ్చదనం, రంగురంగుల పెయింటింగ్స్‌తో తీర్చిదిద్దారు. ఒకప్పుడు ఖాళీ సమయాల్లో అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారిన ఈ స్కూళ్ల ముందు ఇపుడు సెల్ఫీలు తీసుకుని, సగర్వంగా సామాజిక మాధ్యమాల్లో ఆ ఫొటోలను షేర్ చేస్తున్నారు.

43 స్కూళ్లకు రూ.15.21 కోట్లు

మొదటి దశలో ఆధునికీకరించిన స్కూళ్లతోపాటు, మరి కొన్నింటికి అవసరమైన మౌలిక వసతుల ఏర్పాటుకు రెండు దశలో భారీగా నిధులు కేటాయించారు. ఎనిమిది రకాలైన మౌలిక సదుపాయాల కోసం ఇప్పటి వరకు రూ.5 కోట్ల 12 లక్షల 89 వేల నిధులు విడుదల చేశారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, స్కూల్ కమిటీ ఆధ్వర్యంలో రూ.4 కోట్ల 62 లక్షల 75 వేల విలువైన పనులు పూర్తి చేశారు. ఎప్పటికప్పుడు పనుల ప్రగతిని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశాక ప్రభుత్వం ఎలాంటి జాప్యం లేకుండా నిధులు విడుదల చేసి, త్వరితగతిన పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తోంది. మరుగుదొడ్లలో రన్నింగ్ వాటర్, పరిశుభ్రమైన తాగునీటికి వాటర్ ప్లాంట్లు, విద్యుత్ సౌకర్యం, తరగతి గదుల మరమ్మతులు(కిటికీలు, ప్రవేశద్వారం ఏర్పాటు), గ్రీన్ చాక్‌బోర్డులు, ఇంగ్లీష్ లైబ్రరీ, ఫర్నిచర్, పాఠశాలలకు రంగులేసే పనుల్ని ముమ్మరంగా చేపడుతున్నారు.

దశల వారీగా స్కూళ్ల అభివృద్ధి



పాఠశాలల్ని దశలవారీగా అభివృద్ధి చేయడంతో విద్యార్థుల సంఖ్య కూడా పెరుగుతోంది. ఈ ఏడాది విద్యార్థుల సంఖ్య ఆధారంగా స్కూళ్లలో మరిన్ని వసతులు ఏర్పాటు చేస్తాం. నాడు–నేడు పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆన్‌లైన్‌లో పనుల ప్రగతిని అప్‌లోడ్ చేయడంతో, ఆ మేరకు నిధులు వెంటనే విడుదలవుతున్నాయి. దీంతో పనులు చురుగ్గా సాగుతున్నాయి.

– డి.దివాకర్, ఎంఈవో, అనకాపల్లి

శరవేగంగా జగనన్న గృహాల నిర్మాణం


వి.కె.దొర

అనకాపల్లిటౌన్ : అర్హులైన నిరుపేదలకు జగనన్న కాలనీల పేరిట ప్రభుత్వం స్థలాలను మంజూరు చేసిందని, గృహాలను నిర్మించుకోలేని వ్యక్తులకు ప్రభుత్వమే స్వయంగా నిర్మించి ఇస్తుందని జోన్ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ వి.కె.దొర అన్నారు. బుధవారం సాక్షితో ఆయన మాట్లాడుతూ గృహనిర్మాణానికి ప్రభుత్వం రూ.లక్షా 80 వేలు అందిస్తుందన్నారు. ప్రభుత్వమే గృహం నిర్మించాలనుకుంటే లబ్ధిదారు అదనంగా మరో రూ.35 వేలు కాంట్రాక్టర్‌కు చెల్లించాల్సి ఉంటుందన్నారు. రూ.2 లక్షల 15 వేలతో లబ్ధిదారునికి పూర్తి స్థాయిలో గృహాలు నిర్మించి ఇస్తున్నట్లు తెలిపారు. మండల పరిధి కోడూరు–1, 2, మామిడిపాలెంలో గృహ నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయన్నారు. 3,900 మంది లబ్ధిదారులకుగాను 1,485 మంది రూ.35 వేలు నగదును కాంట్రాక్టర్‌కు చెల్లించినట్టు వెల్లడించారు. మిగిలిన లబ్ధిదారులు కూడా చెల్లించేలా అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు.

పర్యావరణానుకూల అభివృద్ధికి కృషి చేయాలి


సదస్సులో మాట్లాడుతున్న ఉమామహేశ్వరి

అనకాపల్లిటౌన్ : పరిశుభ్రమైన వాతావరణంలో జీవించాలంటే పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించి, మొక్కలను ఎక్కువగా నాటాలని జిల్లా ఫారెస్ట్ రీసెర్చ్ రేంజ్ అధికారి కె.ఉమామహేశ్వరి అన్నారు. స్థానిక డైట్ కళాశాల ఆవరణలో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై గురువారం ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో పారిశ్రామికీకరణ పేరిట కాలుష్యాన్ని పెంచుతున్నామని, పర్యావరణ సమతుల్యతను కాపాడుకునేలా అభివృద్ధి ఉండాలని సూచించారు. భావితరాలను దృష్టిలో పెట్టుకుని మొక్కలను నాటి, వాటి ఎదుగుదలకు కృషి చేయాలన్నారు. పర్యావరణానికి అనుగుణంగా మానవ జీవనశైలిని మార్చుకోవాలని సూచించారు. పర్యావరణాన్ని కాపాడితే అది మనల్ని కాపాడుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, ఫారెస్ట్ అధికారులు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సేవలు ప్రశంసనీయం


పారిశుధ్య కార్మికులకు కొబ్బరినూనె, సబ్బులు అందిస్తున్న కార్పొరేటర్ మందపాటి సునీత

అనకాపల్లిటౌన్ : ప్రజారోగ్యంలో పారిశుధ్య కార్మికులు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత అన్నారు. వార్డు పరిధిలో ఉడ్‌పేట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏడాదికి సరిపడా కొబ్బరి నూనె, సబ్బులు, ఇతర సామగ్రిని పారిశుధ్య కార్మికులకు గురువారం ఆమె అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలని సూచించారు. కార్మికులు విధుల నిర్వహణలో ఆయా ప్రాంతాల ప్రజల మన్ననలను పొందాలన్నారు. కార్మికులతో పాటు శానిటరీ సిబ్బంది, సచివాలయం ఉద్యోగులు నిత్యం కాలువలు, రహదారులపై చెత్తను తొలగించేందుక కృషి చేయాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో దోమల నిర్మూలన జరిగి, ప్రజలను వివిధ రకాలైన వ్యాధుల నుంచి కాపాడవచ్చన్నారు. వేసవి కాలంలో కాలువల్లో పూడిక తొలగింపుపై సిబ్బంది దృష్టి సారించాలన్నారు. అనంతరం కరోనా సమయంలో ఉత్తమ సేవలు అందించిన కార్మికులను బ్రహ్మకుమారి సంస్థ అధ్వర్యంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎస్.ఎస్.రవికుమార్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, పార్టీ నేతలు ఎర్రంశెట్టి శ్రీను, అప్పారావు, డొంక సత్తిబాబు పాల్గొన్నారు.

‘పండగలు సంప్రదాయానికి ప్రతీకలు’


మరిడిమాంబను దర్శించుకున్న ఎంపీ సత్యవతి దంపతులతో తుమ్మపాల నాయకులు

అనకాపల్లి రూరల్ : గ్రామ దేవతల పండగలు సంప్రదాయానికి ప్రతీకలని అనకాపల్లి ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి అన్నారు. గురువారం మండలంలోని తుమ్మపాల మేజర్ పంచాయతీ వెంకుపాలెం రోడ్డులో ఉన్న మరిడిమాంబ అమ్మవారి పండగ సందర్భంగా గ్రామానికి వచ్చిన ఎంపీ దంపతులకు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకున్న ఎంపీ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పండగలు గత సంస్కృతిని ప్రస్తుత తరానికి తెలపడంతోపాటు, ప్రజల మధ్య ఐక్యతకు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, ఎంపీటీసీ పన్నీరు వెంకట్రావు, పదాల గణపతి, ఆర్టీసీ సత్యనారాయణ, శంకర్రావు, తుమ్మపాల చక్కెర కర్మాగారం కార్మిక సంఘం నాయకుడు పీవీఎస్ అప్పారావు, చదరం శివ తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిబిరాలతో విజ్ఞాన కాంతులు


కోటవురట్ల శాఖా గ్రంథాలయంలో చిత్రలేఖనం పోటీలో పాల్గొన్న విద్యార్థులు

కోటవురట్ల: గ్రంథాలయాలలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలకు మంచి స్పందన వస్తోంది. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పలు పోటీలలో ఆసక్తి కనబరుస్తున్నారు. గురువారం గ్రంథాలయాధికారి అప్పలనాయుడు ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీ నిర్వహించారు. ఈ పోటీలో 21 మంది విద్యార్థులు పాల్గొన్నట్టు గ్రంథాలయాధికారి తెలిపారు. రీసోర్స్ పర్సన్‌గా శ్రీనివాసరావు వ్యవహరించారు.

విద్యార్థుల దేశభక్తి గేయాల ఆలాపన

అచ్యుతాపురం(అనకాపల్లి) : అచ్యుతాపురం మండల కేంద్రమైన శాఖా గ్రంథాలయంలో గురువారం దేశభక్తి గేయాలను విద్యార్థులు ఆలపించారు. వేసవి శిక్షణ తరగతుల 11వ రోజు కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయురాలు జగదాంబ విద్యార్థులతో పలు దేశభక్తి గీతాలను పాడించారు. దేశనాయకుల గురించి విద్యార్థులకు వివరించారు. గ్రంథాలయాధికారి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

సబ్బవరం:మండలంలోని 33/11 కేవీ సబ్బవరం, అంతకాపల్లి సబ్ స్టేషన్ల పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈపీడీసీఎల్ సబ్బవరం డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నిరీక్షన్ అంబేడ్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. సబ్బవరం,అంతకాపల్లి సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఉత్సాహంగా ఖోఖో పోటీలు


ఖోఖో పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

సబ్బవరం: సబ్బవరం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు గురువారం బుక్ రీడింగ్,న్యూస్ పేపర్ రీడింగ్ నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారి శిరీష తెలిపారు. వేసవి శిక్షణ శిబిరంలో ప్రతిరోజూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఖోఖో ఇతర క్రీడా పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన వారికి శిక్షణ శిబిరం ముగింపు రోజున బహుమతులు అందజేయనున్నట్టు ఆమె తెలిపారు.

భూ సర్వేపై రైతులకు అవగాహన

సింహాచలం(పెందుర్తి): సమగ్ర భూ సర్వేతో భూ వివాదాలకు చెక్ పడుతుందని డిప్యూటీ తహసీల్దార్ రంగలక్ష్మి అన్నారు. పెందుర్తి మండలం గుర్రంపాలెంలో రైతులకు సమగ్ర భూసర్వేపై గురువారం అవగాహన కల్పించారు. గ్రామంలో జరిగే భూసర్వేకు రైతులంతా సహకరించాలని కోరారు. సర్వే ఏవిధంగా చేస్తారో వివరించారు. ప్రతీ రైతు తమ భూమికి సంబంధించిన పాస్‌పుస్తకాలు, డాక్యుమెంట్లతో సర్వే చేస్తున్నప్పుడు భూముల వద్ద ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నక్క కనకరాజు, సర్పంచ్ ఉగ్గిన గోవింద, ఆర్ఐ శివ, కార్యదర్శి నాగరాజు ప్రభు, సర్వేయర్ లక్ష్మి, సర్వే సిబ్బందిపాల్గొన్నారు.

గ్రామ వలంటీర్లలో ‘సేవా వజ్రా’లు

కశింకోట : మండలంలోని ఒకే గ్రామ పంచాయతీకి చెందిన ఇద్దరు గ్రామ వలంటీర్లకు సేవా వజ్ర పురస్కారాలు, మరొకరికి సేవా రత్న పురస్కారం లభించాయి. ఇతర గ్రామాలకు చెందిన మరో నలుగురికి కూడా సేవ రత్న పురస్కారాలు లభించినట్లు ఎంపీడీవో కొంకి అప్పారావు గురువారం తెలిపారు. కన్నూరుపాలెం(ఈ చౌడువాడ) గ్రామానికి చెందిన మురమళ్ల లలిత కుమారి, వర్రి భవానీలకు సేవా వజ్ర పురస్కారాలు లభించాయన్నారు. వారందించిన ఉత్తమ సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం ఈ పురస్కారాలను ప్రకటించిందన్నారు. వీరికి జ్ఞాపిక, ప్రశంసా పత్రాలతోపాటు, రూ.30 వేలు చొప్పున నగదు పురస్కారం అందించనున్నట్లు వెల్లడించారు. ఇదే గ్రామానికి చెందిన పేకేటి దేవీకుమారితో పాటు, నూతలగుంటపాలేనికి చెందిన తెలపల లక్ష్మి, సోమిరెడ్డి పార్వతి, మారిశెట్టి దుర్గా వెంకటలక్ష్మి(జి.భీమవరం), మదిని మమత(వెదురుపర్తి)లకు సేవా రత్న పురస్కారాలు లభించాయన్నారు. వీరికి ఒక్కొక్కరికి రూ.20 వేలు, పతకం, ప్రశంసా పత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ పురస్కారాలను అనకాపల్లిలో శుక్రవారం జరగనున్న కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి చేతుల మీదుగా అందించనున్నట్లు పేర్కొన్నారు. మిగిలిన వలంటీర్లకు సేవా మిత్ర పురస్కారాలను సచివాలయాల వారీగా అందజేస్తామన్నారు. వీరికి రూ.10 వేలు చొప్పున నగదు పురస్కారం ఇవ్వనున్నట్లు తెలిపారు. పురస్కార గ్రహీతలకు నేరుగా బ్యాంకు ఖాతాల్లో నగదు జమవుతుందన్నారు.

మూడేళ్ల సేవకు ప్రోత్సాహం



సేవా వజ్ర పురస్కారం రావడం చాలా సంతోషంగా ఉంది. గ్రామ వలంటీర్‌గా చేరి మూడేళ్ల నుంచి సేవలందిస్తున్నా. అర్హులందరికి సంక్షేమ పథకాలు అందేలా చూశా. ప్రజల తలలో నాలుకగా మసలుతున్నాం. వలంటీర్ వ్యవస్థ ప్రవేశ పెట్టాలన్న సీఎం జగనన్న సంకల్పం మహోన్నతమైంది. దీంతో ప్రజలకు దగ్గరగా, వారికి అవసరమైన సేవలందించడానికి అవకాశం కలిగింది. ఇందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

–మురమళ్ల లలితకుమారి, గ్రామ వలంటీర్, ఈ చౌడువాడ

మర్చిపోలేని అనుభూతి



సేవా వజ్ర పురస్కారం రావడం చాలా హ్యాపీగా ఉంది. మా ప్రజలకు నా వంతు సేవ చేసే అవకాశం కల్పించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటాం. ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజల సహకారంతోనే వలంటీర్‌గా నా వంతుగా చిత్తశుద్ధితో సేవలందిస్తున్నాను. వలంటీర్ అన్నది నాకు ఇచ్చిన బాధ్యత అనుకున్నాను. నా సేవలను గుర్తించి సేవా వజ్ర పురస్కారం అందించడం మర్చిపోలేని అనుభూతినిస్తోంది.

– వర్రి భవాని, గ్రామ వలంటీర్, ఈ చౌడువాడ

నేడు వలంటీర్లకు సేవా పురస్కారాలు

అనకాపల్లి టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలుకు క్షేత్రస్థాయిలో చిత్తశుద్ధితో సేవలందిస్తున్న వలంటీర్లకు ఏటా సేవా పురస్కారాలు అందిస్తున్న విషయం తెలిసిందే. పురస్కారాల్లో భాగంగా ఈ ఏడాది ఉత్తమ సేవలందించిన గ్రామ/వార్డు సచివాలయ వలంటీర్లను ఎంపిక చేసినట్టు జీవీఎంసీ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ వి.కె.దొర, ఇన్‌చార్జి ఎంపీడీవో ధర్మారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరికి జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి చేతుల మీదుగా సేవా వజ్ర, సేవారత్న పురస్కారాలను అందించనున్నట్టు పేర్కొన్నారు. సేవా వజ్రకు రూ.30 వేలు, సేవా రత్నకు రూ.20 వేలు నగదు పురస్కారాలతో పాటు ప్రశంసాపత్రాలు ఇస్తారన్నారు. సేవావజ్రగా కాండ్రేగుల భవాని (సీహెచ్‌ఎన్ అగ్రహారం), నాగులపల్లి జ్యోతి (తగరంపూడి), మిణ్ణాన బాలసరస్వతి (పిల్లావారివీధి సచివాలయం–12) ఎంపికయ్యారు. సేవారత్న పురస్కారాలను దోసూరి తేజశ్విని (లక్ష్మీదేవిపేట), దొడ్డి నూకేష్ (మిరియాలకాలనీ), నరవ సోమసుధ(నెయ్యిలవీధి), సూరిశెట్టి కుమార్ (శాంతినగర్), సబ్బవరపు రజని(గొర్లివానిపాలెం), కాపుశెట్టి ఆనంద్(సీహెచ్‌ఎన్ అగ్రహారం), సేనాపతి సత్తిబాబు(గోపాలపురం), రొంగలి చల్లినాయుడు(కుంచంగి), కలవలపల్లి మదన్(కూండ్రం), మామిడి లోకేశ్వరి(తుమ్మపాల)లను ఎంపిక చేసినట్టు వెల్లడించారు. మిగతా వలంటీర్లందరికీ సేవా మిత్ర సర్టిఫికెట్లను రూ.10 వేల నగదు పురస్కారం తోపాటు ఆయా సచివాలయాల్లో అందజేస్తారు.

కుక్కలు ‘భౌ’బోయ్


పరవాడ రహదారిపై గుంపులుగా సంచరిస్తున్న వీధి కుక్కలు


వాడచీపురుపల్లిలో సంచరిస్తున్న గ్రామ సింహాలు

- గ్రామాల్లో వీధి కుక్కల స్వైర విహారం
- పెరుగుతున్న కుక్కకాటు బాధితులు
- చర్యలు చేపట్టాలని ప్రజల డిమాండ్

పరవాడ: గ్రామ సింహాలు పల్లెల్లో స్వైర విహారం చేస్తున్నాయి. గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయపెడుతున్నాయి. పాద చారులతో పాటు వాహనాలపై వెళుతున్న వారిపై కూడా దాడి చేస్తున్నాయి. దీంతో రోడ్ల మీద తిరగడానికి ప్రజలు బెంబేలెత్తుతున్నారు. మండలంలో ఏ గ్రామానికి వెళ్లినా వీధి కుక్కల గుంపులే దర్శనమిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ సింహాల నిర్మూలనకు పంచాయతీ పాలక వర్గాలు కనీస చర్యలు చేపట్టకపోవడంపై ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భయం.. భయం

పరవాడ, వాడచీపురుపల్లి, తానాం, దేశపాత్రునిపాలెం, ముత్యాలమ్మపాలెం, నాయుడుపాలెం, రావాడ, భర్నికం, గొర్లివానిపాలెం, వెన్నలపాలెం, కలపాక, తిక్కవానిపాలెం తదితర గ్రామాల్లో వీధి కుక్కల బెడద అధికంగా ఉంది. దీంతో ఆ గ్రామాల ప్రజలు భయం గుప్పిట్లో కాలం వెళ్లదీస్తున్నారు. రోడ్లపై కుక్కలు మకాం వేస్తున్నాయి. దీంతో కాయగూరలు, చికెన్, మటన్, చేపలు, నిత్యావసర వస్తువులకు కొనుగోలు చేయడానికి వెళ్లాలంటేనే భయపడిపోతున్నారు. చీకటి పడితే వీధుల్లో తిష్ట వేసి అరుపులు కేకలతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. అర్ధరాత్రి సమయంలో అరుపులతో ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. కుక్కల బారిన పడి పరవాడ, వాడచీపురుపల్లి పీహెచ్‌సీలకు రోజుకు నాలుగైదు కేసులు వస్తున్నాయని ప్రభుత్వ వైద్యాధికారులు చెబుతున్నారు. గ్రామాల్లో గుంపులుగా సంచరిస్తున్న గ్రామ సింహాలను నిర్మూలించాలని అధికారులను కోరినా ప్రయోజనం కనిపించలేదని పలు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుక్కల వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి అరికట్టడానికి చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ప్రయత్నంతో ఏ రంగంలోనైనా రాణింపు

మునగపాక : ప్రతి పనిలోనూ ప్రయత్నం ఉంటే ఫలితం సొంతమవుతుందని ప్రముఖ ధ్యానగురువు సుజాత అన్నారు. మండలంలోని నాగులాపల్లిలో చంద్రశేఖర పిరమిడ్ ధ్యాన కేంద్రంలో గురువారం యూత్ వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరంతర శిక్షణ, ప్రయత్నంతోనే ఏ రంగంలో అయినా రాణించవచ్చన్నారు. ప్రతి మనిషిలోనూ దైవం ఉందని ఒక అడుగు మనం ముందుకేస్తే విశ్వం మరో వంద అడుగులు సహకరిస్తుందన్నారు. యోగా సాధన ద్వారా మంచి జరుగుతుందన్నారు. గణిత ఉపాధ్యాయులు మూర్తి మాట్లాడుతూ గణితం అంటే కొంతమంది భయపడుతుంటారని గణితంతో తమాషాలు చేయవచ్చన్నారు. గణితంలో మెలకువలను ఆయన వివరించారు. కార్యక్రమంలో వాణిబాల, జగన్, శివాజీ, శ్రావణి పాల్గొన్నారు.

వైభవంగా గ్రామదేవతల అనుపు


బంగారమ్మతల్లి సన్నిధిలో సీఐ రంగనాథం

సబ్బవరం: మండలంలోని గొర్లివానిపాలెం శివారు జోడుగుళ్లలో కొలువైన బంగారమ్మ, కుంచాలమ్మ అమ్మవార్ల అనుపు మహోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. వేకువ జాము నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు అమ్మవారికి పసుపు కుంకుమలు, చీరలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ పెద్దలతో కలిసి అమ్మవారిని దర్శించుకున్న సీఐ రంగనాథం వనిత ఉషోదయ యువజన సంఘం ఏర్పాటు చేసిన ఉచిత ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామ దేవతల పండగలతో ప్రజల మధ్య ఐక్యత, సోదరభావం పెరుగుతుందన్నారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నవదుర్గా అమ్మవారి వేషధారణలు, డ్యాన్స్ బేబీ డ్యాన్స్ వంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

క్లుప్తంగా

ఎండలు బాబోయ్ ఎండలు


జనాల్లేక వెలవెలబోతున్న కశింకోట వారపు సంత

కశింకోట: కశింకోటలో వేసవి తాపంతో గురువారం ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. వారపు సంత వెలవెలబోయింది. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు అధిక వేడి, ఉక్కబోత వాతావరణంతో ప్రజలు చాలా వరకు ఇళ్లకే పరిమితమయ్యారు. బయటకు రావడానికి సాహసించలేకపోయారు. దీంతో పంచాయతీ ప్రధాన రహదారులు జన సంచారం లేక బోసిపోయాయి. వారపు సంతలో కూడా కొనుగోలు దారులు లేక దుకాణాలు వెలవెలబోయాయి. సాయంత్రం వాతావరణం చల్లబడ్డాక కూరగాయలు, సరకులు కొనుగోలుకు ప్రజలు మ్మురంగా రావడంతో సంత కళకళలాడింది.

స్థిరంగా కూరగాయల ధరలు

కశింకోట : స్థానికవారపు సంతలో గురువారం కూరగాయల ధరలు దాదాపు స్థిరంగా ఉన్నాయి. కిలో ఉల్లిపాయలు, టమాటా, బంగాళా దుంపలే రూ.20, వంకాయ, బెండకాయ రూ.30, క్యారెట్, బీట్‌రూట్, దొండకాయ రూ.40, క్యాప్సికం రూ.80కి విక్రయాలు సాగాయి.

ప్రజా చార్జ్‌షీట్‌తో అధికారుల్లో స్పందన

తుమ్మపాల : బీజేపీ తలపెట్టిన ప్రజాచార్జ్ షీట్ కార్యక్రమం ద్వారానే పట్టణంలో అన్నమయ్య పార్కు అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయని ఆ పార్టీ మండల అధ్యక్షుడు వి.నర్సింగ్‌యాదవ్ అన్నారు. పట్టణంలో శారదానది ఒడ్డున ఉన్న అన్నమయ్య పార్కు శిథిలావస్థకు చేరడంతో ప్రజాచార్జ్ షీట్ పేరిట జీవీఎంసీ అధికారులకు ఇటీవల వినతి పత్రం అందించామన్నారు. దీంతో అధికారులు స్పందించి అభివృద్ధి పనులు ప్రారంభించారని తెలిపారు.

‘రెజ్లర్లను వేధించిన ఎంపీని అరెస్టు చేయాలి’

అనకాపల్లిటౌన్ : మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించిన బీజేపీ ఎంపీ, రెజ్లింగ్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ చరణ్‌సింగ్‌ను తక్షణమే అరెస్టు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక ఎన్టీఆర్ క్రీడామైదానంలో గురువారం నిర్వహించిన ర్యాలీలో ఆయన మాట్లాడుతూ, దేశ వ్యాప్తంగా 25 రోజులుగా ఆందోళన చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆక్షేపించారు. బీజేపీ ఎంపీపై ఫోక్సో, నిర్భయ చట్టాల క్రింద చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు, నాయకులు గంటా శ్రీరామ్, బి.ఉమామహేశ్వరరావు, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 385 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,340	5,000
రెండో రకం	4,000	4,580
మూడోరకం	3,100	3,980

అనకాపల్లి సినిమాలు

కస్టడీ	: రాజా
రామబాణం	: సత్యనారాయణ-1
అన్నీ మంచి శకునములే	: సత్యనారాయణస్క్రీన్-2
ది కేరళ స్టోరీ	: షిర్డీసాయి
విరూపాక్ష	: పర్తిసాయి
ఫాస్ట్ అండ్‌ఫ్యూరియస్10	: వెంకటేశ్వర
ఉగ్రం	: శ్రీసత్య
బిచ్చగాడు-2	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 114 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-7 యూనిట్లు, బీ పాజిటివ్-37 యూనిట్లు, ఓ పాజిటివ్-70 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 411 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 386 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.